# కేసబియాంకా

"ఇది దెయ్యం పట్టిన ఇల్లా?" అని అడిగేసింది విద్య తటాలున.

ఇల్లు చూపిస్తున్న బ్రోకర్ ఉలిక్కిపడ్డాడు. సర్దుకుని, "భలేవారే, మేడమ్. మా కంపెనీ వాళ్ళు కస్టమర్లకు అలాటి ఇళ్ళు చూపిస్తారని ఎలా అనుకున్నారు?"

"ఇంత పెద్ద ఇల్లు. బోల్డంత కాంపౌండు. ఊరికి దూరంగా ఉన్న మాట వాస్తవమే అయినా రేటు ఇంత తక్కువ ఉండాల్సిన అవసరం లేదు" అంది విద్య సాలోచనగా.

"పెద్ద ఇల్లే కానీ, చాలాకాలంగా ఎవరూ ఉండకపోవడంతో పాడుబడినట్టుంది కదా. పైగా ఓనరు దుబాయ్‌లో ఉన్నాడు. పెద్దంత ఆశలేదు. అయినకాడికి ఇచ్చేయమన్నాడు. మీరు ఈ ఊరికి కొత్తగా వచ్చారు. భర్త ఏక్సిడెంటులో పోయారంటున్నారు. వచ్చిన కాంపెన్సేషన్‌తో ఇల్లు కొందామనుకుంటున్నారన్నారు. సరే, మీ కేదైనా నాలుగు డబ్బులు మిగిలితే మంచిది కదాని మా ప్రొప్రయిటరు గారి మీ కిది చూపించమన్నారు. మీకు మరీ ఇంత సందేహమని తెలిస్తే..."

అతని మాటలను విద్య మధ్యలో తుంపేసింది. "చూడు తమ్ముడూ, సేల్స్‌టాక్ బాగానే చేస్తున్నావు కానీ ఒక విషయం తెలుసుకుంటే మంచిది. నువ్వు ఇవాళ నన్ను మభ్యపెట్టజూసినా పక్కింటి వాళ్ళు ఎలాగూ అసలు విషయం చెబుతారు. ముందే చెబుతున్నాను. నాకు దెయ్యాలు, భూతాల మీద నమ్మకం లేదు. అందుచేత నేను ఇల్లు కొందామని నిశ్చయించుకుంటే ఇవన్నీ నాకు అడ్డు రావు. కానీ పనిమనుషులతో వస్తుంది చిక్కంతా. ఇలాటి మాటలు వింటే వాళ్ళు పనికిరారు. నాకు ఉన్నది అయిదేళ్ళ బాబు. డెబ్బై యేళ్ళ మా నాన్నగారు. నే ఒక్కత్తినీ అంత పని చేసుకోలేను. నువ్వు నాకు నిజం ఏమిటో చెప్పేస్తే నువ్వు నన్ను డబాయిస్తున్నట్టే నేనూ పనివాళ్లను డబాయించగలుగుతాను" అంటూ ఉన్న విషయం స్పష్టంగా చెప్పింది విద్య.

బ్రోకర్ నోరు విప్పక తప్పలేదు - "నాకూ సరిగ్గా తెలీదనుకోండి. ఇరుగు, పొరుగు వాళ్ళు ఏవో ఏడుపులూ అవీ వినబడుతుంటాయంటారు. ఇలా ప్రచారం చేసి చవగ్గా కొట్టేద్దామన్న ఐడియా కావచ్చు. ఇంటాయన దుబాయ్‌లో ఉండడంతో వీళ్ల ఆటలు..."

"...ఎవరైనా ఆడపిల్లను చంపేశారా?" విద్య అడిగింది ఎలాటి ఉద్విగ్నత లేకుండా.

"ఛ, ఛ. చంపడం అంటూ ఏమీ లేదు. ఎవరో చిన్నపిల్లాడి ఏడుపులు వినబడతాయంటారు."

"సరిగ్గా చెప్పే ఉద్దేశ్యం ఉందా? లేదా?" అడిగింది విద్య విసుగ్గా.

"చెప్పానుగా, నాకూ సరిగ్గా తెలీదని.. ఒకతను ఈ ఇంట్లో ఉండేవాట్ట. నాలుగేళ్ల కొడుకు, తనూ అంతే. భార్య పోయినట్టుంది. పనివాళ్ళు కూడా లేరు. ఏదో కేసులో ఇరుక్కున్నాడు లాగుంది. చట్టం నుండి పారిపోయి దాక్కున్నాడేమో. భయం చేత కాబోలు - ఎక్కడికీ వెళ్లేవాడు కాడుట. ఎవరితో కలిసేవాడు కాడు. పిల్లాణ్ని కూడా కలవనిచ్చేవాడు కాడు. ఇరవై నాలుగ్గంటలూ పిల్లాడు ఇంట్లో గడపాల్సిందే! తండ్రి ఇంటిపట్టునే ఉండేవాడు. అలాటిది ఓ పూట పట్నం వెళ్లాడు, బ్యాంకులోంచి డబ్బు తీసుకు తెచ్చుకుందామని. కానీ ఎవడో పోలీసులకి ఉప్పందించడంతో వాళ్ళు ఇతని వెంటబడ్డారు. తప్పించుకుని పారిపోతూ ఇతను నదిలో పడి చచ్చిపోయాడు. అయితే ఇంట్లో ఉన్న కుర్రాడికి ఈ సంగతులు ఏవీ తెలియవు. వాళ్ల నాన్న ఇంటికి బయటనుంచి తాళం వేసి వెళుతూ తను ఓ పూటలో తిరిగి వచ్చేస్తాననీ, తిరిగి వచ్చేవరకూ బయటకు వెళ్లకూడదనీ, ఎవరితోనూ కలవకూడదనీ గట్టిగా

చెప్పివెళ్లాడు. తండ్రి మాటంటే భయపడే ఆ కుర్రాడు ఆ ఇంట్లోనే ఉండిపోయాడు."

విషయమంతా వింటున్న విద్య ఆశ్చర్యపడుతూ, "తండ్రి చెప్పాడు కదాని ఓడ కాలిపోతున్నా ఉన్న చోట నుండి కదలని కేసబియాంకా పద్యం చిన్నప్పుడు చదివాను, అలాగుంది ఈ కథ. మరి ఇలా ఎన్నాళ్లు జరిగింది?"

బ్రోకరు నాన్నాడు.... "ఏమో మరి. వారం పదిరోజులేమో. ఆ కుర్రాడు ఆకలితో ఏడవడం, మూలగడం పొరుగువాళ్లు విన్నారు. కానీ వాళ్ల నాన్నంటే అందరికీ భయం కదా. అందుకని వాళ్లెవరూ వచ్చి పలకరించలేదు, చేరదీయలేదు. చివరికి వాళ్ల నాన్న చచ్చిపోయాడన్న విషయం తెలిసాక అప్పుడు ధైర్యం చేసి వెళ్లి తలుపులు బలవంతంగా తెరిచి చూసారు. అప్పటికే లేటయ్యింది..."

"అంటే... పిల్లాడు పోయాడా? శివ, శివా" అంది విద్య చెవులు ముసుకుంటూ.

"అప్పటినుండే పొరుగువాళ్లందరికీ గిల్టీ ఫీలింగు. రాత్రిళ్లు ఆ అబ్బాయి ఏడుస్తున్న శబ్దం వినబడుతుందంటూంటారు. ఇంట్లో అద్దెకుండడానికి కూడా ఎవరూ రాలేదు. ఇక విసుగెత్తి ఓనరు అమ్మేయమన్నాడు..."

అన్నమాట ప్రకారం విద్య ఆ ఇల్లు కొన్నది. ఇల్లు బాగు చేయించి, రంగులు వేయించి తండ్రీ, కొడుకులతో సహా ఆ ఇంటిలోకి ప్రవేశించేసరికి నెల పట్టింది. ఇంట్లో చేరిన రెండ్రోజుల దాకా తండ్రి రంగారావుకి విషయం చెప్పలేదు. చెబుతూ, "బుజ్జిగాడి ఎదురుగా ఈ విషయం ప్రస్తావించకు సుమా. దడుసుకుంటాడు. పనిమనిషి సింహాచలంతో కూడా అనకు" అని హెచ్చరించింది.

ఆయన అంతా విని, "అందుకా, ఎవరో చిన్నపిల్లాడి అడుగులు ఇంట్లో వినిపిస్తున్నాయి. ఇదన్నమాట కథ! ఆ పిల్లాడు దయ్యమై తిరుగుతున్నాడేమో!" అన్నాడు కళ్లు పెద్దవి చేసి.

విద్య మండిపడింది. "ఏడ్చినట్టే ఉంది. నాకేమీ వినబట్టం లేదు. నీకు వినబడుతున్నాయంటే చెవిలో ఏదో ప్రాబ్లెమ్ ఉందేమో, చూపించుకో" అంది గట్టిగా.

"ఆగాగు. ఇప్పుడు కూడా ఎవరో పిల్లాడు మెట్లు దిగి వస్తున్నట్టు అనిపిస్తోంది." అన్నాడాయన చెవి ఒగ్గి వింటూ.

విద్య హఠాత్తుగా ఫక్కున నవ్వింది. "బుజ్జిగాడే వస్తున్నాడు. ఇలాగుంది నీ తెలివి"

తన చాదస్తానికి ముసలాయనా నవ్వేసాడు.

బుజ్జి తల్లి దగ్గరికి చేరాడు. చేతిలో ఎక్కడెక్కడో పోగేసిన ఇనుప సామాను ఉంది. "అమ్మా, ఇల్లు బాగుందే అమ్మా! పైన మేడమీద అటకలున్నాయి. అక్కడకు వెళ్లి రైలాట ఆడుకోద్దా?" అంటూ తల్లి కొంగు పట్టుకున్నాడు.

"పురుగూ, పుట్రా ఉంటాయి. సింహాచలాన్ని బాగా కడగమంటాను. అప్పుడెళ్లి ఆడుకుందువు గానిలే."

ఆ సాయంత్రం బుజ్జిగాడు పట్టుబట్టి వాటిని శుభ్రం చేయించాడు. అప్పటినుంచీ వాడి మకాం అక్కడే. వారం రోజులకు కాబోలు వాడు తల్లితో అన్నాడు -

"అమ్మా, ఎంత చెప్పినా ఆ కుర్రాడు నాతో ఆడుకోవటం లేదే!" అని.

"ఏ కుర్రాడు?" అంది విద్య తికమకపడుతూ.

"అదిగో, ఆ అటకమీద కుర్రాడు. ఎప్పుడూ నా కేసే చూస్తూ కూచుంటాడు. ఆడుకుందామని చూసినట్టుగా ఉంటాడు. పిలిస్తే రాడు. అస్సలు మాట్లాడ్డు కూడా. భయమేమో..." అన్నాడు బుజ్జి ఆ కుర్రాణ్ని ఇమిటేట్ చేస్తూ.

"సింహాచలం చేత చెప్పించలేకపోయావా?" అంది విద్య విషయం గ్రహించడానికి అవస్థపడుతూ.

"అదొకత్తి. అసలు అక్కడ పిల్లాడు ఎవరూ లేరంటుంది." అన్నాడు బుజ్జి నుదురు కొట్టుకుంటూ.

'నే చూస్తాలే' అని వాణ్ని పంపించేసాక విద్య తండ్రి కేసి తిరిగి, "ఏమిటి నాన్నా, ఇదంతా?

నువ్వేమైనా చెప్పి పెడుతున్నావా?" అంది కోపంగా.

"బావుంది తల్లీ. అసలు నాకీ మధ్య రాత్రుళ్లు చిన్నపిల్లాడి అడుగులే కాక, ఏడుపులూ, నిట్టూర్పులూ కూడా వినబడుతున్నాయి. చెప్తే తిడతావని నోర్మూసుకున్నాను. ఇప్పుడు..."

"... నాకూ, సింహాచలానికి ఏమీ వినబడటం లేదు, కనబడటం లేదు. మీ ఇద్దరికి మాత్రమే.." అంటూ అడగబోతూనే ఆలోచనలో పడిపోయింది విద్య.

రంగారావు గొంతు సవరించుకున్నాడు – "విద్యా, మన ఇంట్లో ఉపనిషత్ సారం ఉండేది గుర్తుందా, దాంట్లో ఏదో ఉపనిషత్‌లో రాసాడమ్మా – 'చీకట్లో కొట్టుమిట్టు లాడే జీవుడికి భగవంతుడు వైపు దారి చూపే దీపకళిక ఏది?' అని ఒక ఋషి ప్రశ్నిస్తాడు. 'అగోచరమైన అనుబంధం' అని జవాబు. ప్రతీ మనిషిలోనూ ఆ దీపం ఉంటుంది. అభౌతిక జీవులతో అనుబంధం చేకూర్చే దారిని చూపడానికి. వయస్సు పెరిగే కొద్దీ ఆ దీపాన్ని మనం ఆర్పేసుకుంటాం. ముసలి వయస్సులో ఆ కాంతి కొద్దిగా, డిమ్‌గా తిరిగి వస్తుంది. కానీ చిన్నపిల్లల్లో జేగీయమానంగా వెలుగుతుంది. ఆ కారణంగానే పిల్లలు దేవుణ్ని, దెయ్యాన్ని కూడా త్వరగా గుర్తించగలరు. అందుకే బుజ్జికి దెయ్యం పిల్లాడు కనబడుతున్నాడు, వినబడుతున్నాడు. ముసలాణ్ని కాబట్టి నాకు వినబడుతున్నాడు. మధ్య వయస్సులో ఉన్నారు కాబట్టి నీకూ, సింహాచలానికి కనబడడు, వినబడడు."

విద్య అయోమయంగా వింది. "ఇంతకీ ఏమంటావు?" అంది చివరికి.

"నాకు ఒదిలేయ్" అంటూ రంగారావు బుజ్జిని పిలిచాడు. "ఒరేయ్, బుజ్జీ! అటకమీద కుర్రాడు బిడియస్తుడురా. భయం పోగొట్టి నువ్వు వాణ్ని ఆడించాలి. వాడికి నాలుగేళ్లే! నువ్వే పెద్దవాడివి కదా" అంటూ బుజ్జిని హుషారు చేసాడు.

"ఓయస్! ఎప్పుడు చూడు, వాడు మొహం ఇలా పెట్టుకు కూచుంటాడు. అమ్మ చాక్లెట్లు ఇస్తానని చెప్పి ఇవ్వకపోతే మొహం పెడతారు చూడు, అలా. అయినా వాణ్ని నవ్విస్తానులే. మరి అప్పుడు నన్ను 'బోయ్' అనకుండా 'మేన్' అంటావా?" అని బేరం పెట్టాడు బుజ్జి.

కానీ పదిరోజులయినా రంగారావుకి రాత్రిళ్లు ఏడుపులు వినబడుతూనే ఉన్నాయి. రాత్రిళ్లు 'నీకేం ఫర్వాలేదులేరా, మా అమ్మ ఏమీ అనదు. ఆడుకుందాం రా' అని బుజ్జి పలవరిస్తూనే ఉన్నాడు. ఆ సోమవారం నాడు ఆయన నిశ్చయించుకున్నాడు. విద్య ముందు ప్రపోజల్ పెట్టగానే మండిపోయింది.

"మతి పోయిందా నాన్నా! ఆ దెయ్యం కుర్రాణ్ని, బుజ్జిగాడిని ఇంట్లో పెట్టేసి మనం ముగ్గురం సెకండ్ షో సినిమా కెళ్లాలా? బుజ్జిగాడికి ఏమైనా అయితే?"

"దెయ్యాలు లేవంటూ మళ్లీ ఇదేం భయం విద్యా?" అని ముసలాయన వెక్కిరించడంతో బింకానికి పోయి విద్య సరేనంది. ఆ రోజు సెకండ్‌షో నుండి తిరిగివచ్చి ఇంటి పోర్టికోలో నిలబడినప్పుడు, "చూసావా విద్యా, నవ్వులు వినబడుతున్నాయి. రెండు జతల అడుగుల సవ్వడి వినబడుతోంది. నా ఎక్స్‌పెరిమెంటు సక్సెస్" అన్నాడు రంగారావు.

"నాకు మాత్రం బుజ్జి నవ్వు ఒక్కటే వినబడుతోంది" అంది విద్య బింకంగా.

"చెప్పానుగా, దీపం వెలుగు నాకు కాస్తయినా కనబడుతుంది. నీకు బొత్తిగా కనబడదు."

అప్పటినుండి రాత్రిళ్లు ఏడుపులు వినిపించకపోవడంతో తన ప్రయోగం విజయవంతమైనట్టు భావించాడు రంగారావు. ఇంకాస్త ముందుకు వెళ్లాడు. ఆ రోజు రాత్రి వర్షం పడుతోంది. మనవణ్ని పిలిచాడు

"ఒరే, బుజ్జీ, అటకమీద కుర్రాణ్ని బయటకు తీసుకువెళ్లి ఆడుకో. తండ్రి కొడతాడని వాడు భయపడవచ్చు. ఆయనే బయటకు రమ్మన్నాడని గట్టిగా చెప్పు. కాస్సేపయ్యాక నువ్వు వచ్చేయి. వాడిని వాళ్ల నాన్న వచ్చి తీసుకెళతాడులే!" అన్నాడు.

బుజ్జి నమ్మలేక పోయాడు, "వానలో ఆడుకున్నా అమ్మ ఏమీ అనదా తాతయ్యా!" అని అడిగాడు ఆశ్చర్యంగా.

బయట వర్షంలో కేరింతలు కొడుతూ బుజ్జి ఆడుతూన్నంతసేపూ టెన్షన్ అనుభవించారు రంగారావూ, విద్యా. మాటి మాటికీ "అవుగో, ఆ పిల్లాడి అడుగులు. నాకు బాగా గుర్తే. దూరంగా వెళ్లిపోతున్నాయి. ఈ ఇల్లు వదిలేసి వెళ్లిపోతున్నాడు. మళ్లీ రాడు. గొడవ వదిలిపోయింది." అంటున్నాడు రంగారావు.

"బుజ్జి గాడి గంతులు తప్ప నాకేమీ వినబడటం లేదు. వర్షంలో తడిసి వాడికేమైనా అవుతుందేమోనని భయం" అంటోంది విద్య.

కాస్సేపటికి "అదుగో, ఆ టపటప అడుగులు. ఇంటిదాకా వస్తున్నాయి. మళ్లీ దూరంగా వెళ్లిపోతున్నాయి.. ఏమవుతోందంటావు!" అంటూ ఖంగారు పడ్డాడు రంగారావు.


"అబ్బా, అవి విండో గ్లాసు మీద పడుతున్న వర్షం చప్పుడు నాన్నా..."

"కాదు, కాదు. ఇప్పుడు నా కర్థమవుతోంది – ఆ కుర్రాడు తనతో బాటు వచ్చేయమని బుజ్జిగాడిని బతిమాలుతున్నాడు. బుజ్జి ఊగిసలాడుతున్నాడు. అందుకే అటునుండి ఇటు, ఇటు నుండి అటు అన్నిసార్లు తిరగడం. అమ్మా విద్యా పొరబాటు చేసేనమ్మా. ఆ పిల్లాడి మోజులో పడి బుజ్జి కూడా అలా..." ముసలాయన భయంతో, కంగారుతో కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

విద్య ఏమీ మాట్లాడకుండా పక్కన పడివున్న స్వెట్టర్ తీసి అల్లుకోసాగింది.

బయట అడుగుల సవ్వడి మరింత జోరుగా వినబడుతోంది. ఇంటినుండి దూరంగా ఒకసారి, ఇంటివైపు మరొకసారి. చిన్నపిల్లవాడి అడుగులతో బాటు, కొన్ని భారీ అడుగులు కూడా వినబడసాగాయి ముసలాయనకు. బహుశా ఆ దెయ్యం అబ్బాయి తండ్రి వచ్చాడేమో. తమతో రావడానికి ఇద్దరూ కలిసి బుజ్జిని ఒప్పించేస్తారేమో! తలుపు తీసుకుని బయటకు వెళదామా అని ఆలోచించి భయం చేత విరమించుకున్నాడు. బుజ్జినైతే ఏమీ చేయరు, వాళ్ల ఫ్రెండు కదా. కానీ తనకా గ్యారంటీ లేదు. బుజ్జి వచ్చేస్తే బాగుండును. ముసలాయనకు పెద్దపెట్టున ఏడుపు, దానితో బాటు నిర్వికారంగా కూచున్న కూతురుపై కోపం ముంచుకువచ్చాయి.

"నువ్వు అసలు తల్లివేనా, విద్యా? నీ కొడుకు..." అరవబోయాడు.



"..నాకేమీ చింతలేదు నాన్నా. నాకు అడుగులు వినబడకపోయినా, దెయ్యాలు కనబడకపోయినా ఎందుకైనా మంచిదని బుజ్జికి వెళ్లేటప్పుడే చెప్పి పంపించేను. ఎట్టి పరిస్థితుల్లోనూ అరగంటలో ఇంటికి తిరిగి వచ్చేయాలని. నా కొడుకు నా మాట జవదాటడు. అటకబ్బాయి కేసబియాంకాలా వాళ్ల నాన్న మాట విని ఈ పరిస్థితి కొని తెచ్చుకుంటే, బుజ్జి కూడా తల్లి మాట వినడంలో కేసబియాంకాని తల దన్నుతాడు. తప్పకుండా తిరిగివస్తాడు. వాళ్లెంత ఊరించినా వాళ్లతో వెళ్లడు. చూస్తూండు" అంది విద్య స్వెట్టరు ఊలు కోసం లేస్తూ.